# కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

● ములుగు ఎమ్మెల్యే సీతక్క

ఏటూరునాగారం: రాబోయే రోజుల్లో అధికారంలోకి ఖచ్చితంగా మన ప్రభుత్వమే వస్తుందని, అందుకు కాంగ్రెస్ పార్టీ ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని ఏఐసీసీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం మండల అధ్యక్షుడు చిటమట రఘు, నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇరుసవడ్ల వెంకన్న అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీతక్క హాజరై మట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే పునాది రాళ్ల వంటి వారని, పార్టీని అధికారంలోకి రావడానికి కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణలో కాంగ్రెస్ రైతుల కోసం ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చాక అమలు చేస్తుందని చెప్పారు. పల్లె పల్లెకు ఇంటింటికీ కాంగ్రెస్ నినాదాన్ని తీసుకెళ్లి పార్టీని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింగరావు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎలయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కొండగొర్ల పోషాలు, జిల్లా మహిళా నాయకురాలు రాధిక, మండల మహిళా అధ్యక్షురాలు కర్ల అరుణ, డొంగిరి మధుబాబు, లాల్ మహ్మద్, ముక్కెర లాలయ్య, సులేమాన్, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీను, గౌస్, తదితరులు పాల్గొన్నారు.



ఏటూరునాగారం : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

## పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ములుగు రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పంటలు దగ్ధమై నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక ఎమ్మెల్యే సీతక్క అన్నారు. బుధవారం అబ్బాపురంలో పంటలు నష్టపోయిన రైతులను పరామర్శించి, నష్టపోయిన పంటలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పకృతి వైపరీత్యాల కారణంగా రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు నష్టపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. పంటలను అధికారులతో అంచనా వేసి ఎకరాకు రూ. 50 వేల నష్టపరిహారం అందించాలని అన్నారు. అనంతరం అకాల వర్షాలకు కల్లాలో తడిసిన ధాన్యం పరిశీలించారు. కోతలు ముగిసి ఇరవై రోజులు గడుస్తున్నా కల్లాలో ధాన్యం అలాగే ఉందని అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తడిసిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని అన్నారు. ఆమె వెంట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ రవిచందర్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, చంద్రమౌళి, నల్లెల్ల భరత్, సర్పంచ్ గండి కల్యాణకుమార్, రేవంత్, భిక్షపతి, అజ్జు, వంశీ, లాల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



ములుగు రూరల్ : కాలిపోయిన విద్యుత్ మోటారును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సీతక్క

# నన్ను ఆదుకుని బతికించండి !

● లివర్, ఊపిరితిత్తులు చెడిపోవడంతో ఆస్పత్రిలో చేరిక
● దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని ప్రాధేయపడుతున్న కుటుంబ సభ్యులు



దీన గాథ

కన్నాయిగూడెం : రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబం, తను పని చేస్తేనే కుటుంబ పోషణ గడిచేది. నిరుపేద కుటుంబంలో చిల్లిగవ్వలేక తనను కాపాడాలంటూ దాతలను వేడుకుంటున్నాడు కటకం అంజయ్య. వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని ముప్పనపల్లి గ్రామానికి చెందిన కటకం అంజయ్య, భార్య ధనలక్ష్మి, కొడుకులు సాయినాథ్, సాయితో కలిసి కూలీ పని చేసి కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు పని చేయనిదే పూట గడవని పరిస్థితి. ఈ క్రమంలో అంతుచిక్కని వ్యాధి దాపురించి కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. కుటుంబాన్ని పోషిస్తున్న అంజయ్యకు ఈ మధ్య కాలంలో ఆరోగ్యం బాగాలేదని ఆస్పత్రికి వెళ్లాడు. అతనికి వైద్యులు వైద్యపరీక్షలు చేసి తన ఊపిరితిత్తులు, లివర్ పాడయ్యాని వైద్యం చేశారు. అప్పటికీ రూ.3 లక్షల వరకు దొరికినకాడల్లా అప్పు తెచ్చి పెట్టి వైద్యానికి ఖర్చు పెట్టారు. ఇంకా రూ.5 లక్షల వరకు ఖర్చయితే గానీ చెప్పలేమని వైద్యులు చెప్పడంతో చేసేదేమిలేక వరంగల్‌లోని మహాత్మగాంధీ మెమోరియల్ ఆస్పత్రి (ఎంజీఎం)లో చికిత్స పొందుతున్నాడు. దాతలు మానవత్వంతో దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని భార్య ధనలక్ష్మి, కుమారులు సాయినాథ్, సాయి కోరుతున్నారు.



తమను ఆదుకోవాలని ప్రాధేయపడుతున్న అంజయ్య, భార్య ధనలక్ష్మి

**సాయం చేయాలనుకునే వారు మా బాబాయి ప్రశాంత్ 94939 64751 కు ఫోన్‌పే, గూగుల్ పే చేయాలని భార్య, ఇద్దరు పిల్లలు వేడుకుంటున్నారు.**

## క్లుప్తంగా

### జ్వరాలపై ఇంటింటా సర్వే



వాజేడు: మండల పరిధిలోని ఘణపురంలో బుధవారం జ్వరాల తీవ్రతపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి జ్వరాలు ఉన్నాయా? లేవా? అని అడిగి తెలుసుకున్నారు. జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి రక్తనమూనాలను సేకరించి ఆర్డీటి పరీక్షలు నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న వారు ప్రభుత్వ వైద్య శాలకు రావాలని సూచించారు. సర్వే నిర్వహించిన వారిలో వైద్య పర్యవేక్షకుడు కోటిరెడ్డి, శేఖర్, చిన్న వెంకటేశ్వర్లు, ఆశా కార్య కర్తలు ఉన్నారు.

### పరామర్శ



ములుగు రూరల్: మండలంలోని శివతండాకు చెందిన దరావత్ చిలకమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కటుంబ సభ్యులను ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ పరామర్శించారు. బుధవారం భాదిత కుటుంబ సభ్యులకు సర్వర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చేయూతనందించారు. ఆమె వెంట చారిటబుల్ ట్రస్టు సభ్యులు ఉన్నారు.

### స్నేహితుడి కుటుంబానికి చేయూత



వెంకటాపురం(కె): మండల పరిధిలోని బీసీ మట్రిగూడెంకు చెందిన రాయవరపు సురేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. సురేష్ స్నేహితులు వైద్య ఖర్చుల కోసం సురేష్ కుటుంబ సభ్యులకు రూ.44,600 ఆర్థిక సాయం అందజేశారు. అందజేసిన వారిలో చింతూరి రోహిత్, బేతంచర్ల నాగరాజు, కుడుముల వంశీ, గగ్గూరి అనిల్, బీసీ మట్రిగూడెం కార్యదర్శి కుంజా సురేష్, కొప్పుల సాయి, కోలా పృధ్వీ, బట్టి విజయ్, నటరాజ్ తదితరులు ఉన్నారు.

### ఆర్థికసాయం



ములుగు రూరల్(గోవిందరావుపేట): ఇటీవల కురిసిన వర్షం కారణంగా గోవిందరావుపేట మండలం పస్రాకు చెందిన సయ్యద్ హసీనా ఇంటిపై చెట్టు పడడంతో గోడ కూలి, ఇంట్లో సామగ్రి పూర్తిగా ధ్వంసం కావడంతో బాధిత కుటుంబాన్ని ములుగు థమ్స్‌ప్ డీలర్ ముబషీర్ పరామర్శించి బాధిత కుటుంబ సభ్యులకు రూ. 5 వేలు ఆర్థికసాయం అందించారు. దాత ముబషీర్ ములుగు జిల్లా కేంద్రంలో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించి ఆర్థికసాయం అందించాడని బాధిత మహిళ తెలిపింది.

### జీపీ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి



ఎస్ఎస్ తాడ్వాయి : గ్రామ పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జేఏసీ మండల అధ్యక్షుడు బండారి బుజ్జిబాబు, కార్యదర్శి కాంతారావు, ప్రధాన కార్యదర్శి దబ్బగట్ల నారాయణ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండలంలోని గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందితో కలిసి ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీపీలో పనిచేస్తున్న సిబ్బంది పీఆర్‌సీలో నిర్ణయించిన కనీస వేతనం చెల్లించాలని కోరారు. గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్ కేటాయించాలన్నారు. జీవో నంబర్ 51ని సవరించి మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది మహేష్, ఆనంద్, సారయ్య, జలంధర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

# గ్రామసభ నిర్ణయం మేరకే భూసేకరణ చేపట్టాలి

ఎస్ఎస్ తాడ్వాయి : పీసా గ్రామసభ నిర్ణయం మేరకే ఏజెన్సీ ప్రాంతంలో భూసేకరణ ప్రక్రియ చేపట్టాలని, పీసా తీర్మాణం లేకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడి సాయిబాబు అన్నారు. బుధవారం అయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో భూసేకరణ, అభివృద్ధి పనుల విషయంలో స్థానిక ఆదివాసీ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా బలవంతపు భూసేకరణ ప్రక్రియను అధికారులు చేపట్టడం సరైంది కాదన్నారు. ఆదివాసీ పవిత్ర స్థలమైన మేడారంలో పీసా గ్రామ సభ, ఆదివాసీల అభిప్రాయాల పరిగణలోకి తీసుకోకుండా అభివృద్ధి పేరుతో చేపడుతున్న భూసేకరణ విరమించుకోవాలన్నారు. మేడారంలో గద్దె పరిసరాల్లో వీవీఐపీల భవన నిర్మాణాల కోసం భూములను స్వాధీనం చేసుకునేందుకు భూసేకరణ కోసం అధికారులు రహస్య సమావేశాలు నిర్వహించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. పీసా, భూ బదలాయింపు చట్టాలపై అధికారులకు ఆదివాసీల అభిప్రాయాలపై ఏ మాత్రం గౌరవం లేదన్నారు. గతంలో దేవాదాయ శాఖకు కేటాయించిన భూమిలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు అవకాశం ఉన్నప్పటికీ స్థానిక ఆదివాసీల భూములను లాక్కొని వారి ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఆదివాసీల ఆధీనంలో ఉన్నటువంటి భూములపై దృష్టి పెట్టి బలవంతపు సేకరణ చేపట్టడం అధికారులు విమరించుకోవాలని లేనియెడల స్థానిక ఆదివాసీల సహకారంతో ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆదివాసీ రాష్ట్ర కోశాధికారి, అడ్వకేట్ కొమురం అనిల్, రాష్ట్ర కార్యదర్శి కోలబోయిన ఆదినారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యుడు లక్ష్మినారాయణ, కన్వీనర్లు భాస్కర్, మంకిడి శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయిబాబు

# దశాబ్ది ఉత్సవాలపై సమీక్ష

వెంకటాపురం(కె): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలపై మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ 2 నుంచి 22 వరకు జరిగే దశాబ్ది ఉత్సవాల విజయవంతం కోసం అధికారులు చేపట్టాల్సిన పనులపై తగు సూచనలు, సలహాలను ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చెరుకూరి సతీష్ కుమార్, జెడ్పీటీసీ పాయం రమణ, మండల స్పెషల్ అధికారి అరవింద కుమార్, తహసీల్దార్ అంటి నాగరాజు, ఎంపీడీఓ అడ్దూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ తాడ్వాయి : రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీపీ గొంది వాణిశ్రీ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ఈనెల 2 నుంచి 22 వరకు జరిగే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ, మండల స్పెషల్ ఆఫీసర్ అప్పయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్, ఎస్సై వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ డీఈ సదయ్య, తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురం (కె) : ఉత్సవాలపై సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

**దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి**

వాజేడు: తెలంగాణా ప్రభుత్వం చేపట్టిన దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి మండల ప్రత్యేకాధికారి సర్దాసింగ్, ఎంపీడీఓ విజయ, తహసీల్దార్ సయ్యద్ సర్వర్, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు తెలిపారు. 2 నుంచి 22వ తేదీ వరకు వరకు జరిగే సంబురాల్లో భాగంగా ఏఏ శాఖలు ఏ పనులను చెయ్యాలో వివరించారు. బుధవారం ముందస్తు సమావేశాన్ని ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఏ ఒక్కరు కూడా దశాబ్ది ఉత్సవాల పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని తెలిపారు.

తెలంగాణా రాష్ట్రం ఏర్పడి పదేళ్ల అవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలకు ప్రభుత్వ కార్యాలయాలు సిద్ధమయ్యాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఉద్యోగులు పూర్తి చేస్తున్నారు. జూన్ 2 నుంచి 22 వరకు రోజుకు ఒక శాఖపై కార్య క్రమాలను నిర్వహించ నున్నారు.

**ఉత్సవాలపై అధికారులతో రివ్యూ**

మంగపేట : ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్పెషలాఫీసర్ తుల రవి ధ్వర్యంలో జూన్ 02 నుంచి 22 వరకు నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాల నిర్వహణ కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 రోజుల పాటు నిర్వహించే దశాబ్ది ఉత్సవాలను శాఖల వారిగా చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్సై తాహెర్ బాబా, ఇంచార్జి ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏటి చేరాలు, వైద్యాధికారి అల్లి నరేష్, యమున, పశు వైద్యాధికారి రాజు, పీఆర్ ఏఈ పాడి వాసుదేవరెడ్డి, ఐబి ఏఈ వలీమహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎస్ తాడ్వాయి : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాణిశ్రీ



వాజేడు : మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సర్దార్‌సింగ్



మంగపేట : అధికారులతో మాట్లాడుతున్న మండల స్పెషలాఫీసర్ తుల రవి

# ఓటరు జాబితా తయారీకి సహకరించాలి

మంగపేట : ఎలాంటి తప్పొప్పులు లేకుండా పారదర్శకమైన ఓటర్ లిస్టు తయారీకి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని తహసీల్దార్ శ్రీనివాసులు కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మండలంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో 2023 అక్టోబర్ 01 నాటికి 18 ఏళ్ళు నిండిన యువతీ యువకులను ఓటర్లుగా నమోదు చేయడం, మృతి చెందిన ఓటర్లు, శాశ్వతంగా వెళ్ళిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలిగించడం, అడ్రస్ మార్పు, వికలాంగులను మార్కింగ్ చేయడం జరుగుతుందన్నారు. దీనికోసం ఈనెల 25 నుంచి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని 46 పోలింగ్ కేంద్రాల్లో ప్రతి రాజకీయ పార్టీ బూత్ లెవల్‌లో ఏజెంట్లను నియమించుకుని తప్పొప్పులు లేని ఓటర్‌లిస్టు తయారీకి సహకరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్ఐ కుమారస్వామి, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

# ఉత్సవాలు గొప్పగా జరుపుకోవాలి

● జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి

ఏటూరునాగారం: దశాబ్ది ఉత్సవాలను గొప్పగా జరుపుకునేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలని జెడ్పీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి ప్రసూనరాణి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ అంతటి విజయ అధ్యక్షతన బుధవారం దశాబ్ది ఉత్సవాలపై ప్రజాప్రతినిధులు, అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సీఈఓ మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి 22 వరకు జరిగే దశాబ్ది ఉత్సవాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. ఆయా శాఖల అధికారులు బాధ్యత తీసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో రైతు దినోత్సవం, పల్లె ప్రగతి, తెలంగాణ గిరిజనోత్సవాలు, డ్రింకింగ్ డే, ఎడ్యుకేషన్, హరితహారం తదితర కార్యక్రమాలున్నాయన్నారు. అనంతరం జెడ్పీ కో ఆప్షన్ సభ్యురాలు వలియాబీ, ఎంపీపీ అంతటి విజయ మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రజాప్రతినిధులు, లీడర్లు, నాయకులు, కార్యకర్తలు ప్రజా సమస్యలకు పరిష్కారం చూపుతూ గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు. గ్రామాల్లోని ప్రతిఒక్కరూ ఉత్సవాల్లో తప్పకుండా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీఓ కుమార్, మండల అధికారులు, సర్పంచులు దొడ్డ కృష్ణ, ఈసం రామ్మూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి

**ఉత్సవాలకు సిద్ధమవుతున్న పోలీసులు**

ములుగు: దశాబ్ది ఉత్సవాలకు పోలీసులు సంసిద్ధమవుతున్నారని జిల్లా ఎస్పీ గాష్ ఆలం అన్నారు. జిల్లా కేంద్రంలో ఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం పోలీసు సిబ్బంది కవాతు సాధన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎస్పీ కార్యాలయంలో ఆవరణ దినోత్సవం సందర్భంగా పోలీసు గౌరవ వందనం స్వీకరించి జెండా ఎగరవేయనున్నట్లు తెలిపారు. పరేడ్ కమాండర్‌గా ఆర్ఐ కిరణ్ ఎంటీఓగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ సదానందం, ఆర్ఐ అడ్మిన్ వెంకటనారాయణ, ఆర్ఐ ఆపరేషన్ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

# పొగాకు అలవాట్లకు దూరంగా ఉండాలి

వెంకటాపురం(ఎం): పొగాకు వాడకం వల్ల అనారోగ్య బారిన పడి ప్రాణాలు కోల్పోకూడదని, యువత పొగాకు అలవాట్లకు దూరంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ విపిన్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్యం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు బుధవారం ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొగాకు వద్దు-ఆహారం ముద్దు అనే నినాదంతో ప్లకార్డులను ప్రదర్శించారు. పొగాకు వాడకంతో అధిక సంఖ్యలో క్యాన్సర్ బారిన పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్, వైద్యులు భవ్య, పార్వతి, చందన, అనిత, సీహెచ్ఓ సదానందం, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

# నిరుద్యోగులకు అవకాశం కల్పించాలి

ములుగు: జిల్లా సఖి కేంద్రంలో, పారా మెడికల్, డిడబ్ల్యూసీడీ ఉద్యోగాల్లో స్థానిక నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ జిల్లా అధ్యక్షుడు పంబిడి శ్రీధర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సఖి కేంద్రంలో కౌన్సిలర్, సీఏ, అడ్మినిస్ట్రేషన్ సెంటర్, పారా మెడికల్ ఉద్యోగాలలో స్థానికేతరులకు అవకాశం కల్పించారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగసామ్యంతో నిర్వహిస్తున్న మిషన్ శక్తిలో భాగంగా మహిళ హబ్‌కు ఉద్యోగుల భర్తీకి స్థానిక అభ్యర్థులకు మాత్రమే అవకాశం కల్పించారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా ఏర్పడి జిల్లాలో స్థానికులకు మాత్రమే అవకాశం కల్పించారని ములుగు జిల్లా మాత్రం ఉమ్మడి వరంగల్ వారికి అవకాశం కల్పించడం సరికాదని అన్నారు. స్థానిక నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని ఉన్నతాధికారులు స్పందించి స్థానిక నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని అన్నారు.

# ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని రంగాపూర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమాన్ని బుధవారం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ జాతీయ మహిళా కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క హాజరై బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులతో కలిసి ఉత్సాహంగా నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా బొడ్రాయి నిర్వహణ కమిటీకి సీతక్క రూ.10వేల విరాళం అందజేశారు. అనంతరం సీతక్క మాట్లాతూ గ్రామదేవతలు గ్రామస్తులను చల్లంగా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇర్ప ఆశ్విని సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు దాయ వెంకన్న, జాజ శ్రీనివాస్, స్వామి పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: మండలంలోని గూర్రేవులల్లో బొడ్రాయి ప్రతిష్ఠ రెండోరోజు కొనసాగుతోంది. గ్రామంలోని ప్రతీ ఇంటి ఆడపడుసులు, వధూవరులతో భక్తి శ్రద్ధలతో తల స్నానాలు చేసి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆకుతోట రామారావు, పూజారులు, వెంకటేష్, కిషోర్, నాగేశ్వరావు, క్షనువాస్, సత్యనారాయణ, నరెంధర్, రజిని, సంజీవ్, నరేష్ చార్యులు, మనోహర్ శర్మ, భార్గవ చారి పాల్గొన్నారు.



కన్నాయిగూడెం : కుంకుమ పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

# మండుటెండలో బ్యాంకుకు వృద్ధురాలు

వాజేడు: వేసవి ఎండలు మండిపోతున్నాయి. బ్యాంకు పనిమీద ఒక వృద్ధురాలు మండుటెండలో వచ్చింది. పూసూరుకు చెందిన నర్సక్క తన ఖాతాలో ఉన్న డబ్బులను తీసుకోవడానికి ఫోన్ నంబర్ యాడ్ చెయ్యాల్సి ఉంది. అందుకు వృద్ధురాలు తప్పనిసరి పరిస్థితుల్లో బ్యాంకుకు వచ్చి ఫోన్‌నంబర్ యాడ్ చేయించుకుని వెళ్లింది. వృద్ధురాలు మధ్యాహ్నం సమయంలో బ్యాంకుకు రావడాన్ని చూసిన వారు అయ్యో తల్లి అంటూ జాలిపడ్డారు.



బ్యాంకుకు వస్తున్న వృద్ధురాలు